తారకరామ ప్రాజెక్ట్ పూర్తయ్యేనా?

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

విశాలాంధ్ర-గుర్ల : రాష్ట్ర ప్రభుత్వం తారక రామతీర్థ సాగర్ ఎప్పటికి పూర్తి చేస్తుందో చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ప్రాజెక్ట్ పూర్తయితే 49 గ్రామాలకు సాగునీరు, విజయనగరం పట్టణానికి సాగునీరు అందుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా బుధవారం విజయనగరం జిల్లాలో తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్ట్ ను సిపిఐ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేవలం రూ.90 కోట్లతో నిర్వాసితుల సమస్య పరిష్కారమవుతుందని, ఆ నిధులు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం వుందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల పరిస్థితి, నిర్వాసితులు, రైతుల సమస్యలను తెలుసుకునేందుకు ఈ నెల 13 నుంచి సిపిఐ బృందం ప్రాజెక్ట్‌లను సందర్శిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పోలవరం సహా రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో పర్యటన చేశామని, అందులో భాగంగా తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్ట్ పరిస్థితి ప్రత్యక్షంగా తెలుకోవడం జరిగిందన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతమని పదేపదే చెప్పే పాలకులు రూ.739 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్ట్‌కు ఎందుకు నిధులివ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక రాష్ట్రమంటూ మాట్లాడే మంత్రి ధర్మాన వెనుకడిన ప్రాంతాల్లో ప్రాజెక్టుల గురించి మాట్లాడరన్నారు. ఉమ్మడి ఆంధ్రలో కూడా రెవెన్యూ మంత్రిగా వున్న ధర్మాన ప్రాజెక్టులకు ఏం నిధులిచ్చారని ప్రశ్నించారు. కేంద్రం కూడా తెలుగు ప్రజలను మోసంచేస్తోందని, జాతీయ ప్రాజెక్ట్ అయిన పోలవరంకు నిధులివ్వకుండా, కర్నాటక లోకి అప్పర్ భద్రకు నిధులిచ్చిందన్నారు. అక్కడి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసమే బిజెపి ప్రయత్నమన్నారు. రాష్ట్ర వ్యాప్త ప్రాజెక్ట్ సందర్శన పూర్తయ్యాక, విజయవాడలో మార్చ్ మొదటివారంలో పార్టీలకతీతంగా రాజకీయపక్షాలతోను, ప్రజాసంఘాతోనూ రౌండ్‌టేబుల్ నిర్వహించి, తరువాత ప్రాజెక్ట్‌లపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు.

ముందుగా ప్రాజెక్టు వివరాలను ఇరిగేషన్ డిఇ రమణ రామకృష్ణకు వివరించారు. రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ అనంతపురం జిల్లా నుంచి ఈ నెల 13న ప్రాజెక్ట్ ల సందర్శన ప్రారంభించామని, ప్రాజెక్ట్ సందర్శన పూర్తయ్యాక ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు .ప్రాజెక్ట్ సందర్శనలతో అనేక సమస్యలు వెలుగుచూస్తున్నాయన్నారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రాజెక్ట్‌పై ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిపెట్టాలన్నారు. అతి తక్కువఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్ట్‌కు అత్యధిక కాలం పడుతోందన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ ప్రాజెక్ట్‌పై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జె.వి.సత్యన్నారాయణ మూర్తి, జి.ఓబులేషు, అక్కినేని వనజ, దేగ ప్రభాకర్, రాష్ట్ర రాష్ట్ర సమితి సభ్యులు ఎ.విమల, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్సులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, ఎన్. నాగభూషణం, బాయి రమణమ్మ, బుగత పావని, జిల్లా సమితి సభ్యులు పొందూరు అప్పలరాజు, పురం అప్పారావు, దేగల అప్పలరాజు, ఎస్. సునీల్, కె.స్రవంతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు బి.రవికుమార్, పి.గౌరీశంకర్, అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కష్టమర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మజ్జి సూరప్పుడు, సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేడియం స్టిక్కర్లు లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు

ఎస్ఐ రమేష్

విశాలాంధ్ర-తెర్లాం: రేడియం స్టిక్కర్లు లేకుండా ఇసుకను నాటుబళ్లపై తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై ఆర్ రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాత్రివేళలో నాటు బళ్లపై ఇసుక రవాణాచేయడంతో వాహనదారులకు, వాహనాలకు ముందస్తుగా తెలియడంలేదని దానివల్ల ప్రమాదాలు జరుగుతాయని ఆయన అన్నారు.కావున నాటుబళ్ళపై రేడియం స్టిక్కర్లు వేయించితే వాహన దారులకు ముం దస్తుగా సిగ్నల్స్ వస్తాయని ఆయన తెలిపారు. కావున నాటుబళ్ళ యజమానులు నాటు బళ్లకు రేడియం స్టిక్కర్లు వేయించాలని ఆయన తెలిపారు.

పీహెచ్‌సిని పర్యవేక్షించిన రాష్ట్ర ఎనీమియా అధికారి సౌజన్య లక్ష్మీ

విశాలాంధ్ర-కొత్తవలస: స్థానిక ప్రాథ మిక ఆరోగ్య కేంద్రా న్ని రాష్ట్ర ఎనీమియా ముక్త భారత అధి కారి సౌజన్యలక్ష్మి పర్యవేక్షించినట్లు పి.హెచ్.సి. వైద్యు రాలు శృతి తెలిపారు. గర్భవతుల్లో వస్తున్న రక్తహీనత, పరీక్షల విధానంపై పరి శీలన చేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది చేస్తున్న హిమోగ్లోబిన్ పరీక్ష శాతం, ఆసుపత్రిలో చేస్తున్న పరీక్ష శాతం బేరీజు వేసి లోటు పాట్లను గుర్తించినట్లు తెలిపారు. గర్భవతుల్లో రక్తహీనత నివారణ మార్గాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది కి సూచించారు. క్షేత్రస్థాయిలో హిమోగ్లోబిన్ పరీక్ష విధానంపై సిబ్బందికి మెళకువలు తెలిపారు. కార్య క్రమంలో వైద్యురాలు సీత, సి.హెచ్.ఓ. కృప ఎమ్.పి. హెచ్.ఇ.ఒ. వెంకటనాయుడు, సూపర్ వైజర్లు సూరి దేముడు, శారద, బేబిరాణి, సిబ్బంది పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంపై ఎల్.కోట, వేపాడ, బొద్దాం, కొట్టాం పి.హెచ్.సి. కేంద్రాలను సందర్శిస్తారని తెలిపారు.

రఘుబాబుకు దక్కని ఎమ్మెల్సీ ... తీవ్ర అసంతృపిలో అభిమానులు

విశాలాంధ్ర-భోగాపురం: పార్టీ కోసం నిబద్ధత తో కష్టపడి పనిచేసినప్పటికీ రఘుబాబుకు ఎమ్మెల్సీ దక్కలేదని, రఘుబాబుకు ఈసారి తప్పకుండా ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పి మోసంచేసారని రఘు బాబు వర్గం కార్యకర్తలు, అభి మానులు తీవ్ర అసంతృపితో రగిలిపోతున్నారు. గత శాసనసభ ఎన్నికలో రఘుబాబు మాట మేరకు వైసిపి పార్టీ గెలుపునకు శక్తికి మించి పనిచేశామని, అలాగే స్థానిక సంస్థల ఎన్నికలో పార్టీ విజ యానికి కృషి చేసాం, కానీ పార్టీ పెద్దలు మమ్మల్ని అవసరం వచ్చినప్పుడు వాడుకొని పదవులు ఇచ్చేటపుడు రఘుబాబును పక్కన పెడుతున్నారని, దీనికి ఇక ఎంతమాత్రం సహించేదిలేదని, రానున్న 2024 ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని అంటున్నారు. స్వత హాగా రఘుబాబు సున్నిత మనస్కుడు, ఎవరికీ ఇబ్బంది పెట్టకుండా సాంప్రదాయ రాజకీయం చేసే వ్యక్తని, ప్రస్తుత రాజ కీయాలలో నిలదొక్కుకోవాలంటే ఇప్పుడు అయన గేరు మర్చి దూకుడుగా మారాల్సి ఉందని అభిమానులు కోరుకుంటు న్నారు. కొమ్మూరు సంజీవ రావు హయం నుండి ఇదే కథ పునరావృత మౌతుందని నియోజకవర్గంలో ఒక సామజికవర్గాన్ని కావాలనే పక్కనపెట్టి ఎదగ నీయకుండా ఉంచేందుకు కొందరు ప్రయత్ని స్తున్నారని వీరికి సరైన సమయంలో తగిన బుద్ధిచెప్తామన్నారు. ఈ నేపథ్యంలో రఘుబాబు పార్టీకి మద్దతు ఇవ్వకపోతే పార్టీ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలోపడే పరిస్థితి ఎదురౌతుందని, నెల్లిమర్ల నియోజకవర్గంలో వైసిపిని బ్రతికించే శక్తీ ఎవరికీ లేదన్నారు. ఇదిలా ఉంటె అప్పుడే కొందరు పార్టీని విడిచిపెట్టేందుకు రెడీ గా ఉన్నట్టు సమాచారం.

జామి గ్రంథాలయానికి ఫర్నీచర్, మరుగుదొడ్లు మంజూరు

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లలిత

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలో ఉన్న గ్రంధాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.లలిత ఆకస్మికంగా సందర్శించారు. గ్రంథాలయ భవన పరిస్థితిని, సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. పాఠకులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు .గ్రంథాలయంలో మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడం అలాగే తగినంత ఫర్నిచర్ లేకపోవడం ఆమె గుర్తించారు. త్వరలో ఫర్నిచర్ అందజేస్తామని, మరుగుదొడ్ల నిర్మాణం చేపడతామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో డిమాండ్ ఉన్న అవసరమైన పుస్తకాలను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమె గ్రంథాలయ అధికారిని మేరీ నిర్మలకు తెలిపారు. ఎన్నో ఏళ్ళుగా మరుగుదొడ్ల సమస్యతో ఉన్న గ్రంథాలయానికి ఎట్టకేలకు పరిష్కారం లభించనుందని పాఠకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవి రావుకు కర్రోతు బంగారురాజు మద్దతు

విశాలాంధ్ర-డెంకాడ: ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవి రావు నామినేషన్ కార్యక్రమానికి నెల్లిమర్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కర్రోతు బంగారురాజు హాజరై మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం వేపాడ చిరంజీవి రావును పసుపుగుచ్చం ఇచ్చి దుస్సాలువాతో నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి, భోగాపురం మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ తదితరులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో భోగాపురం టిడిపి ప్రధాన కార్యదర్శి సిరపు శ్రీనివాసరావు భోగాపురం మండల సీనియర్ నాయకులు కోరాడ తాతారావు భోగాపురం మండల పార్టీ ఉపాధ్యక్షులు కోలా రమాసూరి యువ నాయకులు మండల ప్రుద్విరాజ్ రైతు అనుబంధ కమిటి అధ్యక్షులు రిసు రమణ యూనిట్ ఇంఛార్జి చెల్లుబోయిన బాలు, టిడిపి సీనియర్ నాయకులు నీలాపు అప్పలసూరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉత్తరాంధ్ర పౌరాణిక పద్య నాటిక పోటీలు

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: కీర్తిశేషులు బొద్దుల గురునాయుడు ప్రథమ వర్ధంతిని పుర ష్కరించుకుని ద్వారపూడి గ్రామంలో గురువారం ఉత్తరాంధ్ర పౌరాణిక నాటకాలు నిర్వహిస్తున్నట్లు వారి కుమారులు బొద్దుల నర్సింగరావు, బొద్దుల రమణ, బొద్దుల ఆనంద్ తెలియజేశారు. బుధవారం వారి స్వగృహంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 23వ తేదీన ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పౌరాణిక పద్య నాటిక పోటీలు, బహుమతి ప్రదానోత్సవం, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తమ తండ్రికి పౌరాణిక పద్య నాటికలు అంటే ప్రాణమని, అందుకే ఆయన వర్ధంతిని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతీ ఒక్కరినీ హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బొద్దుల శివప్రసాద్, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోగుల వైద్యసేవలు మెరుగుపడాలి...

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గదుల వెంకటరావు ఆధ్వర్యంలో బుధ వారం మహారాజ గోషా ఆసుపత్రిని సంద ర్శించి రోగుల సమస్యలను, అడిగి తెలుసు కున్నారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలు మెరుగుపడాలని ఈ సందర్భంగా తెలిపారు. రోగులకు పోషకవిలువలతో కూడిన ఆహారం అందిం చాలని డిమాండ్ చేశారు. రోగులకు కావలసిన అన్నిరకాల వైద్య సదుపాయాలను కల్పించాలని, ఆస్పత్రి పరిశుభ్రతను మెరుగుపరచాలని అన్నారు. కావలసిన వైద్య సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. గర్భిణీలకు బాలింతలకు సకాలంలో సేవలు అందించి మరణ రహిత ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ మాధురికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చోడిఆదినారాయణ, ఎస్ ఎస్ రెడ్డి, యువత అధ్యక్షుడు పట్నాల వెంకటేష్, గువ్వల రవి, బంగారు రాజు, దువ్వు వేణు, దువ్వు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను పంచాయతీ విస్తరణాధికారి సందర్శన

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని సోంపురం పాటూరు గ్రామాల్లోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను బుధవారం మండల పంచాయతీ విస్తరణా ధికారి సూర్యనారాయణ పరిశీలించారు.అనంతరం చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో గ్రీన్ అంబాసీడర్లు నిర్వహిస్తున్న పనితీరును పరిశీలించారు.అలాగే జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం అమలు తీరును పరిశీలించి, సక్రమంగా నిర్వహించట కొరకు పలు సూచనలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సోంపురం పంచాయతీ కార్యదర్శి నాగమణి, పాటూరు పంచాయతీ కార్యదర్శి, సోంపురం వాలంటీర్ ప్రవీణ్ కుమార్,గ్రీన్ అంబాసిడర్ లు ఉన్నారు.

సుస్థిర అభివృద్ధికి మనసుపెట్టి పనిచేయాలి

-ప్రతి అర్జీని నిర్ణీత గడువులో పరిష్కరించినందుకు అభినందనలు

రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్‌కుమార్

విశాలాంధ్ర-విజయనగరం: మానవ అభివృద్ధి కి సంబంధించిన సుస్థిర అభివృద్ధి సూచీల సాధన కోసం ప్రతి ఒక్కరూ మనసు పెట్టి పని చేయాలని రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులకు సుస్థిర అభివృద్ధి, స్పందన కార్యక్రమాల పై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సెక్రటరీ విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 17 సుస్థిర అభివృద్ధి సూచీలను ప్రధాన్యతలుగా తీసుకొని 2030 నాటికి శతశాతం సాధించే దిశగా లక్ష్యాలను నిర్ణయించుకోవడం జరిగిందని అన్నారు. నీతిఅయోగ్ అమలుచేస్తున్న 115 ఎస్.డి. సూచీలలో జిల్లా స్థాయిలో 61, గ్రామ, వార్డుస్థాయిలో 47 ప్రభుత్వ పథకాలను మాపింగ్ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అందిన స్పందన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి నందుకు రెండు జిల్లాల కలెక్టర్లను, అధికారులను సెక్రటరీ అభినందించారు. జిల్లాలో 13శాతం రీ ఓపెన్ అర్జీలున్నాయని, 42 శాతం అర్జీ దారులు సంతృప్తిగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా స్పందన వినతులపై సృజన్, గ్రామ, వార్డ్ వాలంటీర్ ఎస్.డి.జి ల పై అనూష, క్వాలిటీ ఎడ్యుకేషన్ పై డా. విజయదుర్గా, మహిళా అభివృద్ధిపై రోజారాణి, స్థానిక సంస్థల ఎస్.డిజిల కు సంబంధించి ప్రసాద్, పట్టణాభివృద్ధి, పారిశుధ్యంపై రావీంద్రబాబు తదిత రులు పవర్ పాయింట్ ద్వారా అవగాహన కలిగించారు.

జగనన్న కాలనీలలో ఇన్ఫ్రా అభివృద్ధి : కలెక్టర్ సూర్యకుమారి

తొలుత కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ హౌసింగ్ కాలనీలలో మౌలిక వసతుల కల్పనలో జిల్లా ముందుందని తెలిపారు. అదే విధంగా జిల్లాలో ఎస్.డి.జి సూచీలలో మాతా, శిశు మరణాలను తగ్గించగలిగామని తెలిపారు. అయితే రక్త హీనత ఉందని, తగ్గించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. పార్వతీపురం మన్యం జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ గిరిజన బాలికల్లో రక్త హీనత ఎక్కువగా ఉందని, తగ్గించడానికి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. కార్యకమం లో విజయనగరం సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ రిసోర్స్ పర్సన్స్ ఎస్.డి.జి ల పై వివరించిన అంశాలు అత్యంత విలువైనవని, వాటిని గుర్తించి ఎస్.డి.జి సూచీల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. రెండు జిల్లాల డి.ఆర్.ఓ లు గణపతిరావు, వెంకటరావు, ఆర్.డి.ఓలు, జిల్లా అధికారులు, తహసిల్దార్లు, ఎంపిడిఓ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీసి, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు పెద్దపీట

విశాలాంధ్ర-నెల్లిమర్ల: బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారి టీలకు రాజకీయ పదవుల్లో పెద్దపీట వేస్తున్నా రని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మొయిదలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర క్యాబినెట్ మంత్రులలో 40 శాతం మంత్రి పదవులు, 60 శాతం ఎమ్మెల్సీలు బిసి, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు కట్టబెట్టారని చెప్పారు.సామాజిక న్యాయం ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని చెప్పారు. జిల్లాలో ఇద్దరు క్షత్రియులకు ఎమ్మెల్సీ పదవులు ఇవ్వడంతో పాటు, రాష్ట్రంలో ఐదుగురికి ఎమ్మెల్యే టికెట్లు జగన్మోహన్ రెడ్డి ఇచ్చారని చెప్పారు. టిడిపి హయాంలో జిల్లాలో క్షత్రియుల కోటా అశోక్ గజపతి ఒక్కరికే పదవులు కట్టబెట్టారని చెప్పారు. తనకు మళ్లీ ఎమ్మెల్సీగా అవ కాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అధి ష్టానం నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి, కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఎంపీటీసి సభ్యులు పెనుమత్స సంతోష్ బాబు, నాయకులు దవళ లక్ష్మణరావు పాల్గొన్నారు.

రూ.10వేల లోపు పింఛను వచ్చిన ప్రభుత్వ పింఛనుదారులు బియ్యం కార్డుకు అర్హులు

తహశీల్దార్ శ్రీనివాసరావు అర్హులకు వినతి

విశాలాంధ్ర-శృంగవరపుకోట : రూ.10వేల లోపు ప్రభుత్వ పెన్షన్ వస్తున్న వారు రైస్ (బియ్యం) కార్డు పొందుటకు అర్హులని తహశీల్దార్ డి.శ్రీనివాసరావు, పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మీ మీ సచివాలయాల పరిధిలో వున్న వారితో కొత్త రైస్ కార్డుకి బుధవారం నుండి దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

పార్వతీపురం మన్యం

కేంద్ర బడ్జెట్ కు నిరసనగా 24న ధర్నా

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ప్రజల నెత్తిన అప్పులు చేసి కార్పొరేట్లకు పంచే విధంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఉందని దీనికి నిరసనగా ఈనెల 24న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్టు పట్టణ సిపిఎం కార్యదర్శి గొర్లి వెంకట రమణ, పాకల సన్యాసిరావు అన్నారు. ఈ మేరకు పట్టణంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ బడ్జెట్లో ఉపాధి హామీకి, వ్యవసాయ రంగానికి, ఎస్సీ, ఎస్టీలకు విద్యా, వైద్యరంగాలకు ప్రభుత్వ నిధులు కేటాయింపులు పెంచాలని, ఉద్యోగ ఉపాధికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కావున ఈ ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు ముట్నూరు వెంకటరమణ (బుచ్చిబాబు), పార్టీ అభిమానులు లాడె వరప్రసాద్, పల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

హౌసింగ్ ఎం.డి డా॥లక్ష్మీషా



విశాలాంధ్ర-సీతానగరం : జగనన్న లే అవుట్ లో గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టరు లక్ష్మీశా అన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాల ప్రగతిని పరిశీలించడానికి జిల్లాకు విచ్చేసిన ఆయన మండలంలోని కాసాపేటలో ఇళ్లనిర్మాణంను తనిఖీచేశారు. ప్రారంభంకాని ఇళ నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. పునాదులస్థాయి, లింటల్‌స్థాయి, రూఫ్ స్థాయిలో ఉన్న గృహాల నిర్మాణం ప్రతీవారం పురోగతి సాధించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు వేసినప్పటికీ, విద్యుత్ కనెక్షన్ లేదని లబ్దిదారులు తెలియజేయగా వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. రఘురాం మాట్లాడుతూ ఇక్కడ 8 గృహాలు పూర్తయ్యాయని, 26 గృహాలకు స్లాబ్‌వేయాలని వివరించారు. మొత్తం 59 గృహాలు నిర్మాణం జరుగుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ డిఇ ప్రసాద్,ఏఈ జానకీరాం, వర్క్ ఇన్స్పెక్టర్ కృష్ణ, సెక్రటరీ మురళి, సిబ్బంది లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

సిసి పనులు తనిఖీ చేసిన ఐటిడిఎ పిఓ

విశాలాంధ్ర-పార్వతీపురం/గుమ్మలక్ష్మీపురం/కురుపాం: గుమ్మలక్ష్మీపురం మండలంలో సిసి రహదారులు, కాలువలు, వరద నివారణ కరకట్టల పనులను ఐటి డిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణుచరణ్ మంగళ వారం తనిఖీ చేశారు. కురుపాం మండలం మంతిని వలస, నేరేడు వలస గ్రామాలు, గుమ్మలక్ష్మీ పురం మండలం బాలేసు గూడ, కేసరి గూడకొండ శిఖర గ్రామాలను సందర్శించారు. పనుల నాణ్యతలో రాజీ ఉండరాదని పేర్కొన్నారు. అన్ని గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు ఉండాలని ఆదేశించారు.

జిసిసి గోడౌన్ పరిశీలన

గిరిజన సహకార సంస్థ గిడ్డంగులు, ఎంఎల్ఎస్ పాయింట్లు, గ్యాస్ గోడౌన్, జిసిసి పెట్రోల్ బంకులను ప్రాజెక్టు అధికారి తనిఖీ చేశారు. వాటి నిర్వహణపై వివరాలను అడిగి తెలుసుకుని, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజనులకు మేలు జరగాలని పేర్కొన్నారు. అటవీ ఫలసాయం కొనుగోలు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులకు లాభదాయకత ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ వి. మహేంద్ర కుమార్, గిరిజన సంక్షేమ శాఖ డిఇ తదితరులు పాల్గొన్నారు.

సిసిఐ ఆధ్వర్యంలో అడగండి చెప్తాం...!

సిసిఐ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ చదలవాడ హరిబాబు



విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్/బెలగాం: పట్టణంలోని వేదాంత జూనియర్ కళాశాలలో జాతీయ వినియోగదారుల సమన్వయ సమితి (సిసిఐ) ఆధ్వర్యంలో బుధవారం అడగండి చెప్తాం-విద్యా ర్థులు.. హక్కులు తెలుసుకోండి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో సిసిఐ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ చదలవాడ హరిబాబు మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలకై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ టోల్ ఫ్రీ నెంబర్ని 1967ను ప్రవేశపెట్టిం దన్నారు. ఆన్‌లైన్‌లో జరిగే మోసాలపై 1930ను భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. ఐఎస్ఐ ప్రమాణాలు, ఐఎస్ఐ ముద్రను తీసుకోకుండా నడుపుతున్న ఆర్ఓ ప్లాంట్లపై విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఫుడ్ ఇన్స్పెక్టర్ పి.వెంకటరమణ మాట్లాడుతూవిద్యార్థులు తప్పనిసరిగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలోని ఆహార పదార్థాలైన పిజ్జా, బర్గర్లు మంచూరియా, చికెన్ ఫ్రైడ్ రైస్, ఎగ్ ఫ్రైడ్ రైస్ తిని ఆరోగ్యాన్ని చెడగొట్టుకోవద్దని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు.రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఇమ్మానుయేల్ ప్రసంగిస్తూ ఆహార నియంత్రణ అధికారులు చాలా తక్కువ మంది ఉన్నందున కల్తీ ఆహార తయారీదారులపై సరైన నియంత్రణ ఉండటం లేదని అన్నారు. దీనివలన కల్తీ ఆహార పదార్థాలను తిని వినియోగదారులు ఆసుపత్రి పాలవుతున్నారన్నారు. సిసిఐ మీడియా ప్రతినిధి రామకృష్ణ మాట్లాడుతూ ప్రక్క రాష్ట్రంలో సంచార ఆహార తనిఖీ ప్రయోగశాల వాహనాలు ఇప్పటికే 10 ఉన్నాయని అన్నారు. సిసిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వల్లెం లక్ష్మీ చెన్నకేశవరావు మాట్లాడుతూ పాలతో తయారుచేసిన స్వీట్స్ ప్యాకెట్స్ పై తప్పనిసరిగా ఎక్స్పైరీ డేట్ ముద్రించాలని, అటువంటి ఎక్స్పైరీ డేట్ ముద్రించని షాపుల వివరాలను తెలియపరిస్తే సంబంధిత అధికారుల తో తనిఖీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. రుచి కొరకు వాడే టేస్టీ సాల్ట్ అనేది అత్యంత ప్రమాదకరమైనదని, వెనిగర్, సాసుల ప్రమాదాన్ని, ఈ ఆహారాన్ని తీసుకున్న వాటివలన వచ్చే జబ్బుల గురించి వివరించారు. మోతాదుకు మించి వాడే టెస్టింగ్ సాల్ట్, టమాటా సాస్ ఇవన్నీ కూడా నాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయని, బుద్ధి మాంద్యం కలిగిస్తుందని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పేట బాలకృష్ణ, కళాశాల యాజమాన్య ప్రతినిధులు, స్థానిక వినియోగదారుల సంఘ నాయకులు మన్యం రామకృష్ణ, వారణాసి శ్రీహరి, లక్ష్మణరావు, మహిళా మండలి నాయకురాలు రాణి, కళాశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చోళ్లపదం ఘటన దురదృష్టకరం

విశాలాంధ్ర-కొమరాడ: మండలంలో చోళ్లపదం గ్రామంవద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవుకోన పంచాయతీ అంటివలస గ్రామస్తులు ఐదుగురు చనిపోవడం అత్యంత దురదృష్టకరమని టీడీపీ అరకు పార్లమెంట్ బిసిసెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఇంతమంది రహదారి ప్రమాదంలో చనిపోవడం ఇదే మొదటిసారేమోనని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరుకలచివేస్తుందన్నారు. రోడ్డుప్రమాదంలో చనిపోయిన వారికి రూ.5లక్షలు, గాయపడ్డ వారికి రూ.1లక్ష చొప్పున ఆర్థికసాయం చేయాలనీ కోరారు. టీడీపీ తరుపున భాధితకుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

ఇళ్ల నిర్మాణానికి నిధుల కొరత లేదు

- రోజుకి 25 కోట్ల బిల్లుల మంజూరు
- గృహనిర్మాణ శాఖ ఎండీ లక్ష్మీషా

విశాలాంధ్ర-సాలూరు రూరల్: రాష్ట్రంలో జగనన్న లేఅవుట్ లలో ఇళ్ల నిర్మాణానికి నిధులకొరత లేదని గృహనిర్మాణ శాఖ ఎండీ లక్ష్మీషా అన్నారు. బుధవారం నెలిపర్తి, కరాసువలస లే అవుట్‌లలో గృహనిర్మాణాల పురోగతిని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణానికి నిధులకొరత లేదని, ప్రతీ రోజు రూ.25 కోట్ల మేర బిల్లులు మంజూరు చేస్తున్నామన్నారు. లే అవుట్‌లో ఎటువంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 5 లక్షల ఇండ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. హౌసింగ్ లబ్ధిదారులకు తక్కువ ధరకు సిమెంట్, ఇనుమును అందిస్తున్నామన్నారు. లేఅవుట్ లలో మౌలిక వసతుల కల్పిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేం దుకు ప్రతీ జిల్లాకి రాష్ట్ర స్థాయి అధికారిని నియమించామన్నారు.సమస్యలు ఉంటే సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తే పరిష్కరిస్తారన్నారు. నెలిపర్తి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణాలు ప్రారంభించని లబ్దిదారులకు ఇంజనీరింగ్ సహాయకులు అవ గాహన కల్పించడంతో పాటు చైతన్యం తీసుకువస్తే నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయ వచ్చ న్నారు. గుమడాం లేఅవుట్-5లో కూడా మౌళిక సదుపా యాల కల్పనకోసం నిధులు అవసరం అయితే మం జూరు చేస్తామని చెప్పారు.ప్రతీ ఇంటి నిర్మాణానికి ఒక లక్ష ఎనభై వేల రూపాయలు చెల్లిస్తు న్నామన్నారు. పూర్తయిన ఇండ్లకు నేమ్ బోర్డులను అమర్చాలన్నారు.ఈ పర్యటనలో ఆయనతో పాటు గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.రఘురాం, డైరెక్టర్ మున్సిపల్ కమీషనర్ హనుమంతు శంకర్రావు, తహశీల్దారు భాను ప్రసాద్ హౌసింగ్ డిఈఈ సోమేశ్వరరావు, ఏఈ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దళాయిపేటలో ఘనంగా శ్రీరామమందిర పునః ప్రతిష్ట ఉత్సవాలు



విశాలాంధ్ర-పార్వతీపురం: కొమరాడ: మండలంలోని దళాయిపేట గ్రామంలో భక్తులు, దాతలసహకారంతో నిర్మించిన శ్రీరామమందిర ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అసంఖ్యాక దేవాలయ ప్రతిష్టాపరులు, అగణిత యజ్ఞయాగకర్త వీరఘట్టంకు చెందిన ప్రముఖ జ్యోతిష్య పండితులు ఎస్వీఎల్ఎన్ శర్మయాజీ, అతని శిష్య బృందం ఆధ్వర్యంలో ప్రతిష్టా ఉత్సవాలు రెండురోజుల పాటు జరిగాయి. మంగళవారం శ్రీమహాగణాధిపతి పూజతో ప్రారంభించి దీప ప్రతిష్ట ద్వజార్చనం,గ్రామప్రదక్షిణ, ఊరేగింపు, జలాదివాసం, వాల్మీకి రామాయణం పారాయణ జరగ్గా, రెండోరోజు బుద వారం క్షీరాధివాసం, ద్యానాధివాసం, స్నపనం, శ్రీరామ పూజ, సీతామాతకు బీజాక్షర సామూహిక కుంకుమార్చన చతుర్వేద పారాయణ, శేషహోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం ముగింపు రోజున గోపూజ, పూర్ణాహుతి హోమం, కుల దేవతారాధన, కంకణదారుల దర్శనాలు, ప్రతిస్టాంగ తిరుకళ్యాణం, ఆలయంలో విగ్రహాలు ఏర్పాటు ఉంటుందన్నారు. గురువారం 5వేలమందికి అన్నసంతర్పణ కార్యక్రమం ఉంటుందని ప్రతీ ఒక్కరూ విచ్చేసి ప్రతిష్ఠ ప్రసాదాన్ని స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు. ఇదిలాఉండగా మంగళవారం రాజులగుమడ వారిచే శ్రీకృష్ణాకోలాటం, గజపతినగరం వారిచే రేలారేరేలా, బుదవారం రామాంజనేయ యుద్ధం, సత్యహర శ్చంద్రనాటకం ప్రదర్శించారు. గ్రామంలోని భక్తులతో పాటు వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులతో గ్రామం కిటకిట లాడింది.



జిల్లాలో ధాన్యం రైతుల ఆవేదనను ప్రభుత్వం గుర్తించాలి

-ధాన్యం సేకరణ గడువు మార్చి వరకు పెంచాలి

-ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు

విశాలాంధ్ర-పాలకొండ: ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని అంతటినీ సేకరిస్తామని ప్రకటించిన అధికారులు, నేడు రైతుల వద్ద ధాన్యం అమ్ముకుందామంటే ఉన్న ధాన్యంలో 33 శాతం చెప్పున దప దపాలుగా మాత్రమే రైతుల వద్ద ధాన్యాన్ని సేకరించడం తో రైతులు విసిగి వేసారి నష్టపోతు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవలసిన దినస్థితికి కారణం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల కారణమని వారి ఆలోచన విధానం మార్చుకోకపోతే రైతుల నుంచి వచ్చే ఆందోళనకు కారణం అవ్వాల్సి వస్తుందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు హెచ్చరించారు. బుధవారం కల్లాల్లో ఉన్న రైతు ధాన్యం వద్దకు వెళ్లి ఆయన మాట్లాడుతూ నేడు పాలకొండ మండలంలో గల వివిధ గ్రామాల రైతులు పడుతున్న బాధలపై ప్రభుత్వ దృష్టి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ స్పందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ధాన్యం రైతుల ఆవేదనను ప్రభుత్వం గుర్తిం చాలని ఆ విధంగా ధాన్యం సేకరణ గడువును మార్చి నెల వరకు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌల రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కిమిడి రామ్మూర్తి నాయుడు, సంఘం నాయకులు పిట్ట రమణ, బివి రమణ ఉన్నారు.

లిల్లీ పుష్పనాధంకు ఎమ్మెల్సీ పరామర్శ

విశాలాంధ్ర-పాలకొండ: పంచాయతీ పూర్వపు కమిషనర్, పాలకొండ డివిజన్ ఎన్జీవో సంఘం గౌరవాధ్యక్షులు లిల్లీ పుష్పనాధంకు బుధవారం ఎమ్మెల్సీ పి. విక్రాంత్, ఎంపీపీ బి. భాను, చైర్‌పర్సన్ వై. రాధాకుమారిలు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది, స్వగృహానికి క్షేమంగా వచ్చిన పుష్పనాధాన్ని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. వారితోపాటు సుధాకర్, మరియదాస్, పి. దవళేశ్వరరావు, కె. లక్ష్మి, పల్లా భాను, కె. అజయ్‌బాబు, రుంకు రామకృష్ణ, గోవిందు, మోహన్, రమణారావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కార్పొరేట్లకు రాయితీలు.. సామాన్యులపై భారాలు : సీపీఎం

విశాలాంధ్ర-కురుపాం: బిజెపి లోకసభలో ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో గల ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బుధ వారం సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోలక అవినాష్ ఆధ్వర్యంలో సిపిఎం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కి వ్యతిరేకంగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి కురుపాం మెయిన్ రోడ్డు మీదుగా రావాడ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, పేద ప్రజల డబ్బు కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ సామాన్యులపై భారాలు వేసిందని, వెనుకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు నిధులు కేటాయింపు, విశాఖ రైల్వేజోన్, ప్రభుత్వం కడప స్టీల్‌ప్లాంట్, పోలవరం, విశాఖ మెట్రోకు నిధులఊసే లేదని విమర్శించారు. బడ్జెట్లోని ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలు, కోతలకు వ్యతిరేకంగా ఈనెల 24వ తేదీన మండల, జిల్లా కేంద్రం ల్లో నిరసనకు పెద్ద ఎత్తున కార్మికులు, ,సిపిఎం నాయకులు, కార్యకర్తలు అధిక పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సిపిఎం పార్టీ కార్యవర్గ సభ్యులు కొల్లిగంగు నాయుడు, ఎం.మన్మధరావు, వి. ఇందిరా, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, కోరాడ ఈశ్వరరావు, సిపిఎం సీనియర్ నాయకులు మండంగి రమణ, కురంగి సీతారాం పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ స్కౌట్స్ దినోత్సవం

విశాలాంధ్ర - వంగర : ప్రపంచ స్కౌట్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం నాడు వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాల ఆవరణలోవిద్యార్థులు పిరమిడ్ విన్యాసాలు పలువురిని ఆకట్ట కున్నాయి. విద్యార్థులకు మాస్ డ్రిల్లు నిర్వహించి, క్రమ శిక్షణతో ఉత్తమ విద్యను అభ్యశించాలని మాస్టర్ మైండ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ బెవర ఈశ్వర రావు, లక్ష్మున్నాయుడు పారి నాయుడు నేతాజీలు విద్యార్థులకు సూచించారు. వరల్డ్ స్కౌట్స్ డే ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఉత్తమ పౌరులుగా తయార వ్వాలని అన్నారు. అనంతరం ఉపాధ్యాయ సిబ్బంది, స్కౌట్ ఉపాధ్యాయులు, ఈశ్వరరావు సంతోష్లను ఘనంగాసన్మానించారు.

దేవత పండగను ప్రశాంతంగా జరుపుకోవాలి

సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుమల రావు

విశాలాంధ్ర - రామభద్రపురం : మండల కేంద్రంలో జరగనున్న గ్రామ దేవత పండగ ను గ్రామస్తులు అందరూ కలిసి ప్రశాంతంగా జరుపుకోవాలని బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుమల రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వసంతల వీధి రామాలయంలో గ్రామ సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఉప సర్పంచ్ చింతల రామకృష్ణ, ఆధ్వర్యంలో గ్రామస్తులతో పండగ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామస్తులందరూ పండగను సక్రమంగా జరుపుకోవాలని కోరారు. పండగ సమయంలో గ్రామస్తులు ఘర్షణలకు పాల్పడకుండా ఉండాలని అన్నారు. పండగ సోమవారము, మంగళవారం, బుధవారం జరుగునని కావున ఆ మూడు రోజులు గ్రామస్తులందరూ ఐకమత్యంతో ఉండాలని అన్నారు. పండగ సందర్భంగా స్థానిక ఎస్సై సురేంద్రనాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

మిమ్స్‌లో బేసిక్ లైఫ్ సపోర్ట్ శిక్షణ

విశాలాంధ్ర - నెల్లిమర్ల : మిమ్స్ కళాశాలలో బేసిక్ లైఫ్ సపోర్ట్ శిక్షణ బుధ వారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణలో 150 మంది జూని యర్ డాక్టర్లు పాల్గొన్నారు. వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఆదేశాల మేరకు, ఐఆర్సీ నియమావళి ప్రకారం వైద్య నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాలరావు, సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర రావు, అనస్థీషియా హెచ్ ఓడీ డాక్టర్ డివిజి శంకరరావు, నైపుణ్య శిక్షకులు డాక్టర్ చైతన్య డాక్టర్ భరత్, డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమాజ మార్పునకు శ్రీశ్రీ రచనలు ఎంతో ఉపయోగం

విశాలాంధ్ర - సీతానగరం : సమాజ మార్పుకు శ్రీశ్రీ రచనలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని సీపీఎం నేతలు తెలిపారు. రెడ్ బుక్స్ డే సందర్భంగా బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సీతానగరం కమిటీ సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి లక్షము నాయుడు మాట్లాడుతూ పెట్టుబడిదారీ విధానం వలన ఉపాధి రహిత అభివృద్ధి జరుగుతుందని, నిరుద్యోగం పెరుగుతుందని, ఉద్యోగాలకు భద్రత లేదని, దేశసంపద కొంతమంది వ్యక్తులు చేతుల్లోకి వెళు తుందన్నారు.శ్రీశ్రీ రచనలు, కవితలు సమాజ మార్పుకి ఉపయోగపడే అనేక అంశాలను తెలియజేసారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గవర వెంకటరమణ, గంటజ్యోతి, అప్పారావు, కృష్ణశాంతి పాల్గొన్నారు.

ఘనంగా కళ్యాణీ స్కూల్లో కవలల దినోత్సవం

విశాలాంధ్ర - కవిటి : మండల కేంద్రంలోని శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల లో ఘనంగా కవలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ మేరకు బుధవారం ముందుగా పాఠశాలలో ఉన్న కవలల విద్యార్థులకు ఉపాధ్యాయులు తిలకధారణ చేసి ఆశీర్వదించారు. అనంతరం కేకును కట్ చేసి విద్యా ర్థులందరూ వారికి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పండి బిందు మాధవి మాట్లాడుతూ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నాలుగు జంటలు కవలలు చదువుతుండడం గమనార్హమని అన్నారు.అనంతరం ఎకడమిక్ అబ్జర్వర్ రాణి కవలల యొక్క విశిష్టత విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సెంచురియన్‌లో క్యాంపస్‌లో ప్లేస్మెంట్ డ్రైవ్

విశాలాంధ్ర - హిరమండలం,/ పర్లాఖిమిడి : ఒడిస్సా రాష్ట్రంలోని పర్లాఖి మిడీలోని సెంచూరియన్ యూనివర్సిటీ విద్యార్థుల కోసం బుధవారం క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ ను నిర్వహించడం జరిగిందని సి యు టి ఎం డిప్యూటీ రిజిస్ట్రార్ డా,, ఎస్ కామేశ్వరరావు తెలిపారు. సంత్సరానికి 8.2 లక్షలు జీతం ప్యాకేజి తో 10 మంది విద్యార్థుల ను ప్రధాన్ నియమించింది. ర్యాలీస్ ఇండియా. టాటా ఎంటర్ ప్రైజెస్ సంత్సరానికి 8.5 లక్షలు జీతం ప్యాకేజి తో 10 మంది విద్యార్థుల ను నియమించు కుంది, ఐటీసి లిమిటెడ్. ఇఫ్కో కిసాన్. ప్రోపార్మా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అగ్రి సర్వీసెస్, బేసిక్స్ కృషి సమృద్ధి లిమిటెడ్. మరియు కొన్ని ప్రైవేట్ బ్యాంకు లు ను రిక్రూట్ చేసుకున్నారు, ఎంపిక అయిన విద్యార్థుల ను సి యు టి ఎం వైస్ ప్రెసిడెంట్ ప్రొపెసర్ డి ఎస్ రావు, వైస్ ఛాన్స్ లర్ సుప్రియ పట్నాయక్, రిజిస్ట్రార్ ప్రొపెసర్ అనిత పాత్రలు అభినందనలు తెలియజేశారు.

వైభవంగా శ్రీలక్ష్మీ గణపతి ఆలయ ప్రతిష్ఠాపన పూజలు

మొదటి రోజు ప్రత్యేక పూజలు, దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట దేవి జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి సహిత శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి, శ్రీరమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయ ప్రతిష్ఠాపన పూజలు బుధవారం ఉదయం విఘ్నేశ్వర పూజతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైస్ ఎంపీపీ సుధారాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి.సత్యశేఖర్, కర్ణాట స్వామినాయుడు, రిటైర్డు ఫిజికల్ డైరెక్టర్ మళ్ల రామకృష్ణ, క్వాలిటీ ఇన్ హెూటల్ యజమాని నాని, మద్ది కృష్ణ, కనకదుర్గ స్వీట్స్ యజమాని ప్రాగాజీ మాలీ (బాబూలాల్), సాయిరాం చిట్స్ అనాల రమేష్ (చిన్న), శ్రీనాదు వెంకన్నబాబు, జెడ్పిటీసీ ఎం.వెంకటలక్ష్మి, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, వార్డు సభ్యులు సూరిబాబు తదితరులు స్వామి వారి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4గంటల నుండి దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం దేవతామూర్తుల రాతి విగ్రహాలకు జలాదివాస ప్రత్యేక పూజలు (జలాభిషేకం) నిర్వహించారు. కాగా గురువారం ఉదయం 8 గంటల నుండి సర్వదేవతా పూజా హెూమం, క్షీరాధివాసం తదితర ప్రత్యేక పూజలు, 24న శుక్రవారం ఉదయం 7.51 గంటల నుండి విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ రఘురాజు వివరించారు.

పెళ్లిచూపులకు వెళ్లి పరలోకానికి....

ఆటో లారీ ఢీకొని 5 గురు మృతి, 8 మందికి గాయాలు

విశాలాంధ్ర - కొమరాడ/బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం చోళ్లపదం శివాలయం సమీపంలో మలుపు వద్ద ఆటో, లారీ ఢీకొని పెళ్లిచూపులకు వెళ్లి ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు మృతి చెందగా ఎనిమిది మందికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కొమరాడ మండలం అంటివలస గ్రామానికి చెందిన 13మంది మండలంలోని తుమ్మలవలస గ్రామానికి పెళ్లి కుమార్తె ఇంటికి ఇల్లు చూపులకు వెళ్లి తిరిగి ఆటోలో అంటివలస గ్రామం వస్తుండగా మార్గమధ్యంలో చోళ్లపదంగ్రామం శివాలయం సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో పెను ప్రమాదం సంభవించింది. ఈసంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఊయక నరసమ్మ (54), ఊయక లక్ష్మి (48), మెల్లిక శారద (35), మెల్లిక అమ్మడమ్మ (80) సంఘటన స్థలంలోనే మృతి చెందారు. ఊయక వెంకటి (55) పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆటోలో ఉన్న మరో 8మంది క్షతగాత్రులను ఆరిక ప్రసాద్, ఊయక వెంకటేష్ (ఆటో డ్రైవరు), ఊయక లావణ్య, ఊయక సత్యవతి, మెల్లిక కమల, ఊయక జయసుధ, ఊయక రామస్వామి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. అయితే వీరిలో ఊయక రామస్వామి. ఊయక వెంకటేష్ ల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం రిఫర్ చేశారు. పెను ప్రమాదం జరగడంతో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, అదనపు ఎస్పీ ఓ. దిలీప్ కిరణ్ లు ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న క్షతగాత్రులను మాజీ ఉప ముఖ్యమంత్రి, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు. పార్వతీపురం డిఎస్పీ ఎ. సుభాష్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వద్దకు వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన పలువురు రాజకీయ నాయకులు క్షతగాత్రులను పరామర్శించారు. కొమరాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపారు.

దివ్యాంగుడికి మూడు చక్రాల కుర్చీ వితరణ

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట మండలంలోని భర్తాపురం గ్రామంలో గల శ్రీ కళ్యాణ ప్రసన్న వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా తాళ్లూరు ధనశేఖర్‌కు ఆలయ ధర్మకర్త కె.జయవిష్ణు, సత్యసాయి ట్రస్టు సభ్యులు మూడు చక్రాల సైకిలును బుధవారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా జయవిష్ణు మాట్లాడుతూ శృంగవరపుకోట ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర రెండు కాళ్ళు లేని ఒక వ్యక్తి కన్పించాడని, ఆయన్ని అడగ్గా తనది గుంటూరు అని, ట్రైన్ దిగుతుండగా ప్రమాదవశాత్తు రెండు కాళ్ళు పోగొట్టుకున్నట్టు తెలియజేసారు. ఆ వ్యక్తిని భర్తాపురం ఆలయం వద్దకు తీసుకుని వచ్చి శ్రీసత్యసాయి సంస్థ ఆధ్వర్యంలో ట్రై సైకిలుతో పాటు దుప్పట్లు, తినుబండారాలు అందించామని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. ట్రై సైకిల్, దుప్పట్లు అందించిన శ్రీసత్యసాయి ట్రస్టు వారికి, వెంకటేశ్వర ఆలయ ధర్మకర్త జయవిష్ణు మాస్టారుకి ధనశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

లోక్‌సత్తా పార్టీ పోరాటం ఫలితంగా...

ఎన్ఎంసీ అనుమతి పొందిన తొలి వైద్య కళాశాల

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్ : జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల కావాలని 2014 నుండి 2019 వరకూ ప్రజల తరపున లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి చేసిన అలుపెరుగని పోరాటాల ఫలితంగానే నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ ఎంసి) విజయనగరం జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలకి 2023-2024 సంవత్సరంకి గాను 150 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చెయ్యడం తమకి ఎంతో ఆనందం కలిగించిందని లోక్ సత్తాపార్టీ జిల్లా కార్యదర్శి అల్లంశెట్టి నాగభూషణం అన్నారు.బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లా కి ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు చెయ్యడంలో చొరవ చూపారని 500 వందల కోట్ల రూపాయలు వెచ్చించి గాజుల రేగలో ఆధునిక హంగులతో కళాశాల నిర్మాణం జరగడం అభినందనీయమని,వైద్య కళాశాల నిర్వహణ కోసం బోధన,బోధనేతర సిబ్బందిని నియమించారని, ఆసుపత్రిలో సేవలు పెరగడంతో రోగుల తాకిడి కూడా పెరిగిందని నాగభూషణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 16 కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చెయ్యగా ఎన్ఎంసీ అనుమతి పొందిన తొలి వైద్య కళాశాల మనదే కావడం శుభ పరిణామమని రాజకీయాలతో సంబంధం లేకుండా లోక్ సత్తాపార్టీ ఒక్కటే రాష్ట్ర లో ప్రజల తరపున పని చేస్తుందని అన్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తో మాట్లాడి జిల్లాకి క్యాన్సర్ ఆసుపత్రిని కూడా మంజూరు మంజూరయ్యేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నగర పార్టీ అధ్యక్షుడు తాత్రాజు రాజారావు, కార్యదర్శి పి.ఎల్.ఎన్. రాజు, పతివాడ చంద్రరావు, బోర రమేష తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - బెలగాం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ విధానంలో ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ అవకాశం కల్పించిందని, పదవ తరగతి పాసైన విద్యార్థులు, ఇంటర్మీడియట్ లో జాయిన్ అయ్యి మధ్యలోనే మానేసిన విద్యార్థిని విద్యార్థులు ఈ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు అర్హులని కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్య ప్రతి ఒక్క విద్యార్థి పొందాలన్న ఉద్దేశంతో ఇంటర్మీడియట్ డ్రాపౌట్స్ గా విద్యార్థులు ఎవరూ ఉండకూడదన్న ఉద్దేశంతో ఇంటర్మీడియట్ విద్య సెక్రటరీ వి. శేషగిరిబాబు చొరవచూపి ప్రభుత్వం నుంచి ఈ ప్రత్యేక అనుమతులను సంపాదించి పెట్టారని, అర్హత ఆసక్తిగల విద్యార్థులు ఆన్ లైన్ ద్వారా %www.apopenschool.ap.gov.in% వెబ్సైట్‌లో దరఖాస్తు చేసుకో వచ్చన్నారు. ఈనెల 27వ తేదీ లోపల దరఖాస్తు చేసుకొనవచ్చని, ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించవచ్చని తెలిపారు.

శ్రీసన్యాసేశ్వరస్వామి ఆలయ ఆదాయం రూ.14,92,378/-

విశాలాంధ్ర - శృంగవరపుకోట : మహాశివరాత్రి జాతరకు గాను పురాతన ఆలయంగా పేరు పొందిన శ్రీసన్యాసేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు సమర్పించిన హుండీ, టికెట్లు, తలనీలాలు ద్వారా ఆదాయం రూ.14,92,378/-లని దేవస్థానం ఈఓ బి.శ్రీనివాస్ బుధవారం వెల్లడించారు. సన్యాసేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం నుండి విచ్చేసిన సీనియర్ అసిస్టెంట్ శ్యాం ప్రసాద్ పర్యవేక్షణలో టికెట్లు, తలనీలాలు, ప్రసాదం అమ్మకాలు ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రస్టు బోర్డు చైర్మెన్ జి.పైడితల్లి, అర్చకులు, పాల్గొన్నారు.

గంగన్నపాడులో పారిశుధ్యలోపం, మంచినీటి సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో గంగన్నపాడు గ్రామంలో పారిశుధ్యలోపం కారణంగా సాయింత్రం అయితే చాలు ప్రజలను విషదోమలు కుడుతూ భయాందోళన కలిగిస్తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. ఎన్నిసార్లు చెప్పున్న గ్రామ సెక్రెటరీ దీనిపై పట్టించుకోవడం లేదని ఏమైనా అంటే 6 మాసాలు అయితే కానీ వీధికాలువాల పూడిక తీసేదే లేదని అంటున్నారని ప్రజలు వాపోతున్నారు. ఆ గ్రామంలో మంచి నీటి కొరత తీవ్రంగా ఉందని ఇంటింటి కొళాయి దిష్టి బొమ్మల్లా ఉన్నాయే తప్ప ఎప్పుడో జాము శివరాత్రి కి ఒకసారి నీరు వస్తాయి తప్పా తాగేటందుకు నీరు కూడా వదిలే దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు. విధుల్లో మా కాలువాలు మేమే తీసుకుంటు న్నామని ప్రజలు అంటున్నారు. ఈ విషయంపై గంగన్నపాడు సెక్రెటరీ వినోద్‌కుమార్ ను వివరాలు కోరగా 6 మాసాలు అయితే కానీ పూడికలు తేసేదే లేదని, ఎప్పుడయినా గ్రీన్‌అంబాసిడర్ ల ద్వారా పూడికలు తీయిస్తామని సెక్రెటరీ వినోద్‌కుమార్ స్థానిక విలేకరులతో వాపోయారు. ఇప్పటికయినా పై అధికారులు దృష్టి పెట్టి పారిశుధ్య పనులు చేపట్టి,మంచినీటి కొరత తీర్చాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో లేకుండా చర్యలు తీసుకుని దోమల బారిన పడకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పోలిపల్లి పైడితల్లి అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు

విశాలాంధ్ర - భోగాపురం : మండలంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మ వారి ఆలయం హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం జరిగింది. దేవాదాయ శాఖ అధికారులు కే. శ్రీరామ్, విజయ్ ప్రసాద్ గ్రామ సర్పంచ్ కర్రోతు వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ లిక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ఏడాది ఉగాది నుంచి ఇప్పటివరకు హుండీ ద్వారా 2,39,316 రూపాయలు ఆదాయం వచ్చినట్లు చైర్మన్ కర్రోతు పైడిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ పతివాడ రామకృష్ణ పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవ వేడుకలలో

వైసీపీ నాయకులు అవనాపు విక్రమ్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలోని 20 వ డివిజన్ తూర్పు బల్లివీధి వేంచేసిన శ్రీ శ్రీ శ్రీ లక్ష్మి గణపతి ఆలయ 28వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి వేకువ జాము నుంచి ప్రత్యేక పూ జలు, అర్చనలు, పంచా మృతా భిషేకాలు నిర్వ హించారు. 28వ వార్షికోత్సవం సందర్భంగా వై.ఎస్ఆర్.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అవనాపు విక్రమ్ గారు ఆలయానికి చేరుకుని, స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహక కమిటీ ప్రతినిధులు ఆయనకు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. వేద పండితులు విశేష పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులను అందజేశారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ గారు మాట్లాడుతూ తన కుటుంబానికి లక్ష్మిగణపతి ఆలయంతో ప్రత్యేక అనుబంధం ఉందని అన్నారు. కోర్కెలు తీర్చే స్వామిగా, లక్ష్మీ గణపతి స్వామికి ప్రజల్లో పేరు ఉందని అన్నారు. ఆలయ అభివృద్ధికి కమిటి సభ్యులు చేస్తున్న కృషిని ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని విక్రమ్ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ కె.తవిటిరాజు, ఆలయ కమిటీ అధ్యక్షులు రాయన నారాయణరావు, కమిటీ సభ్యులు, పలువురు స్థానిక పెద్దలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కొండచాఖరాపల్లిలో మహిళ హత్య..!

విశాలాంధ్ర - వంగర : కొండ చాకరా పల్లి గ్రామంలో మహిళ హత్యకుగురైనట్లు తెలిసింది. కొండచాకరా పల్లి గ్రామ సమీపంలో ఆగ్రామానికి చెందిన గంట చినమ్మి (62) పొలంలో శవమై పడి ఉంది. ఈ మెను ఎవరు ఏ విధంగా చంపి జొన్నచెలులో పడివేసింది తెలియవలసి ఉంది. ఆమె మెడగొంతుకు చీరతోగట్టిగా చుట్టి హత్య చేసింధీ నిర్ధారించవలసి ఉంది. అంతే కాకుండా ముక్కులోనున్నటు వంటి కమ్ములు, చెవిలో ఉన్నటువంటి బంగారం కానపురసలు, మెడలో నున్నటు వంటి రెండు తులాల వరకూ బంగారం తాడును బలత్కారంగా లాగి వేశారా, లేకముఖంపై బాగా కొట్టివేసి వస్తువులను లాగేసుకొన్నట్లు, ఆమే ముఖంపై నున్నటువంటి గంట్లును బట్టి చెప్పవలసి వస్తోంది. వీటన్నింటినీ బట్టి చూస్తే ఈమెది హత్యగానే సర్వత్రా అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. ఈమె గత సోమవారం మధ్యాహ్నం నుంచియు ఆమె ఆగ్రామంలో కనిపించటం లేదని ఆగ్రామస్థుల తెలియజేశారు. ఆ రోజు ఉదయం వంగర మండలంలో గల నీలయ్యవలస నుండి ఉదయమే భోజనం బాక్సతో కొండ చాఖరపల్లి గ్రామం వచ్చినట్లు, ఆమె రెండవ కుమార్తె, ఆ గ్రామస్థులు తెలియజేశారు. నాడు ఉదయం ఆమె కుమార్తెలు సతిపిడకల పుణ్యవతి, కళావతిలు ఇరువురు నీలయ్యవలసలో వుంటున్నారు. కొండచాకరా పల్లికొన్ని రోజులు, నీలయ్య వలసలో కొన్ని రోజులు ఉంటున్నట్లు గ్రామస్థులు చెప్పారు. సోమవారం ఉదయం బాక్స్ పట్టుకొని కొండచాఖరాపల్లి వచ్చిన ఆమె మధ్యాహ్నానికి కనిపించకుండా పోయిన ఆమె కోసం కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళతో ఆచూకీ కోసం వారి కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం ఆగ్రామానికి చెందిన రౌతు గౌరుబాబు పంటచేలకు నీరు కట్టేందుకు వెళ్లగా ఆయన జొన్న చేలు మధ్యలో గంట చినమ్మి శవమై కనిపించింది. వెంటనే ఆయన ఆమె కుటుంబ సభ్యులకు ఈమే శవం పొలంలో ఉన్నట్లు తెలియజేయటంతో ఆమె కుటుంబ సభ్యులు వంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి..టీనేజ్ గర్భాలను నివారించాలి : కలెక్టర్ సూర్యకుమారి

- సఖి, సహేలీ గ్రూపుల నిర్వహణపై సమీక్ష
- ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని పిలుపు

విశాలాంధ్ర - విజయనగరం : జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. అవసరమైతే ప్రభుత్వ చట్టాలను వినియోగించి కఠిన చర్యలను తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, తల్లితండ్రులతో పాటు, వివాహం చేసే పురోహితులు, ఫొస్టర్లపైనా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. టీనేజ్ గర్భాలను నివారించాలని, దీనికోసం బాలికలను చైతన్య పరచాలని సూచించారు. సఖి, సహేలీ గ్రూపుల నిర్వహణపై, కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలాలవారీగా సమీక్షించారు. సఖి, సహేలీ సమావేశాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. బాలికలు కూడా డిగ్రీవరకు చదువుకొనేలా వారిని చైతన్య పరచాలని, 21 ఏళ్లలోపు వివాహం చేసుకోకుండా చూడాలని కలెక్టర్ కోరారు. చిన్నవయసులోనే గర్భం దాల్చడం ద్వారా ఎదురయ్యే దుష్పరిణామాలను వివరించాలని చెప్పారు. ఇలాంటి గర్భాలవల్ల ఒక్కోసారి తల్లి ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుందని, ఇది ఎంతమాత్రమూ శ్రేయస్కరం కాదని అన్నారు.

బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతీనెలా సఖి సమావేశాలను తప్పనిసరిగా నిర్వహిస్తూ, ఆ గ్రూపు సభ్యులతో మమేకం కావడం ద్వారా, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, జరగబోతున్న బాల్య వివాహాలను తెలుసుకొనే అవకాశం కలుగు తుందన్నారు. దీనికోసం వివిధ శాఖల సిబ్బందితో గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో, మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో, కలిసికట్టుగా పనిచేసినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని స్పష్టం చేశారు. ప్రస్తుత విజయనగరం జిల్లాలోని ఆరు మండలాల్లో సుమారు 53 వేలమంది గిరిజనులు ఉన్నారని, వారి సమస్యలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. వారందరికీ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలో 99 శాతం ప్రసవాలు ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయని, ఇది సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. ప్రసవం అయిన మొదటి గంటలోపల తప్పనిసరిగా బిడ్డకు తల్లి పాలిచ్చేవిధంగా వారిని చైతన్య పరచాలని సూచించారు. ఈ పాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. సఖి, సహేలీ సమావేశాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు. బాల్య వివాహాలను అరికట్టడం, టీనేజ్ గర్భాలవల్ల కలిగే దుష్పరిణామాలు, డ్రాపౌట్స్, సఖి, సహేలీ గ్రూపుల లక్ష్యాలు, దిశ, ఫోక్సో చట్టం తదితర అంశాలను కూడా మండల సర్వసభ్య సమావేశాల్లో చర్చించడం ద్వారా మరింత అవగాహన కల్పించ వచ్చునని కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్యారోగ్యశా ఖాధికారి డాక్టర్ ఎస్వి రమణ కుమారి, ఐసిడిఎస్ పిడి బి.శాంతకుమారి, గిరిజన సంక్షేమశాఖ డిడి మాట్లాడుతూ, తమ శాఖాపరమైన అంశాలను వివరించారు. సఖి గ్రూపులపై రూపొందించిన లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓలు, వైద్యాధికారులు, ఐసిడిఎస్ అధికారులు, మహిళా పోలీసులు, యునెసెఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.